
ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి, ఇతర నాయకులు


మీడియాతో మాట్లాడుతున్న బూచేపల్లి, పక్కన జెడ్పీ చైర్పర్సన్ వెంకాయమ్మ

రాష్ట్రంలో అరాచక పాలన

- ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి
- దర్శిలో వెన్నుపోటు దినం విజయవంతం
- హాజరైన జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, ఇతర నాయకులు

దర్శి (కురిచేడు): రాష్ట్రంలో అరాచకం, అవినీతి, వెన్నుపోటు రాజకీయాలకు నిరసనగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు దర్శిలో ఆ పార్టీ కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారని జిల్లా అధ్యక్షుడు, దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం దర్శిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు సుమారు 500 మంది నాయకులు, కార్యకర్తలు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో వెన్నుపోటు దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తహసీల్దార్ శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో బూచేపల్లి మాట్లాడుతూ రాష్ట్రంలో రాజకీయ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అరాచకం పెచ్చుమీరిందని, అడుగడుగునా అవినీతి పాతుకుపోయిందని, వెన్నుపోటే పరమావధిగా పాలన కొనసాగుతోందని విమర్శించారు. 2014 ఎన్నికల్లో తప్పుడు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని గుర్తుచేశారు. ఆ తర్వాత మళ్లీ 2024లో సూపర్ సిక్స్‌తో పాటు 143 హామీలు ఇచ్చారని, అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఒక్కటి కూడా అమలు చేయకుండా ప్రజలను మళ్లీ మోసం చేశారన్నారు. ఏడాది పాలనలో ఎలాంటి హామీలు అమలు చేయకుండానే రూ.15 వేల కోట్లు అప్పులు చేసి తాము మాత్రం విలాసవంతమైన జీవితాన్ని అనుభవిస్తూ రాష్ట్ర ప్రజలను గాలికి వదిలేశారని విమర్శించారు. తల్లికి వందనం పథకం కింద ఒక్కో విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామని చెప్పి వారిని మోసం చేశారని, 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు రూ.18 వేల ప్రకారం ఇస్తామని, ఉచిత బస్సు ఇస్తామని మహిళలను తీవ్రంగా మోసం చేశారని దుయ్యబట్టారు. రైతులకు ఒక్కొక్కరికి పెట్టుబడి సాయం కింద రూ.20 వేల ప్రకారం ఇస్తామని రైతులను ఘోరంగా మోసం చేయడమే కాకుండా వారు పండించిన పంటలకు కనీసం గిట్టుబాటు ధరలు కూడా కల్పించకుండా వారి ఉసురు తీశారని,


దర్శి గడియార స్తంభం సెంటర్‌లో వైఎస్సార్ సీపీ నేతల నిరసన హోరు

తద్వారా రైతుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయని విచారం వ్యక్తం చేశారు. బాబు వస్తే భవిష్యత్తు గ్యారంటీ అన్న చంద్రబాబు ప్రజలకు భవిష్యత్తు లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్ని విపత్కర సంఘటనలు ఎదురైనా ఇచ్చిన మాట తప్పకుండా ఎన్నికల వేళ ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను సైతం నెరవేర్చిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ పేర్కొన్నారు. పేద పిల్లలు ఇంగ్లిష్ నేర్చుకోకూడదని ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం రద్దు చేశారని, ఇంటింటికీ వెళ్లి ఇచ్చే రేషన్‌ను రద్దు చేసి షాపుల వద్దనే తీసుకోవాలని చెప్పడంతో పేదలు, వృద్ధులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పింఛన్లను అనేక సాకులు చూసి రద్దు చేశారని, పింఛన్లు తీసుకునేందుకు వెళ్లి ప్రాణాలు పోగొట్టుకుంటున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయన్నారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, రోజూ ఎక్కడో ఒకచోట మహిళలపై


తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి, వెంకాయమ్మ

అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయని విమర్శించారు. అన్ని రంగాల్లో విఫలమైన నాయకుడు ప్రజలను మోసం చేయడంలో దిట్టగా చంద్రబాబు చరిత్రలో మిగిలిపోతాడని వెంకాయమ్మ విమర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి మేడికొండ జయంతి, రాష్ట్ర మున్సిపల్ విభాగం కార్యదర్శి కుమ్మిత అంజిరెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి గుంటు పోలయ్య, రాష్ట్ర పార్టీ సంయుక్త కార్యదర్శులు పోశం మధుసూదన్‌రెడ్డి, ఐవీ రెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శులు మన్నం శ్రీధర్, సూదిదేవర అంజయ్య, వాణిజ్య విభాగం అధ్యక్షుడు కోల్లా విజయభాస్కర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు జి.దేవప్రసాద్, ఐదు మండలాల మండల పార్టీ కన్వీనర్లు వెన్నపూస వెంకటరెడ్డి, కాకర్ల కృష్ణారెడ్డి, యన్నాబత్తుల వెంకట సుబ్బయ్య, చింతా శ్రీనివాసరెడ్డి, తూము వెంకట సుబ్బారెడ్డి, కురిచేడు, ముండ్లమూరు జెడ్పీటీసీలు నుసుం వెంకట నాగిరెడ్డి, రత్నరాజు, జిల్లా యూత్ అధ్యక్షుడు గొంగటి శ్రీకాంత్‌రెడ్డి, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి బత్తుల వెంకట సుబ్బయ్య, ముండ్లమూరు ఎంపీపీ సుంకర సునీతా బ్రహ్మారెడ్డి, నియోజకవర్గ ఇంటలెక్చువల్ అధ్యక్షుడు వీరగంధం కోటయ్య, పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు మేరువ సుబ్బారెడ్డి, ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు బొమ్మిరెడ్డి లక్ష్మీరెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ అమీన్ బాషా, దర్శి వైస్ ఎంపీపీలు సోము దుర్గారెడ్డి, కొరివి మునలయ్య, పార్టీ విద్యార్థి విభాగం రీజనల్ కో ఆర్డినేటర్ దుగ్గిరెడ్డి నారాయణరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలకు కూటమి సర్కార్ వెన్నుపోటు

- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్


యర్రగొండపాలెంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి, ఇతర నాయకులు

యర్రగొండపాలెం: కూటమి సర్కార్ ప్రజలను వెన్నుపోటు పొడిచిందని ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ ధ్వజమెత్తారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పిలుపు మేరకు బుధవారం జరిగిన వెన్నుపోటు దినం సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. అధికారం కోసం ఎన్నికల ముందు ప్రజలకు తప్పుడు వాగ్దానాలు చేసి గద్దెనెక్కిన కూటమి సర్కార్ రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని విమర్శించారు. సీఎం చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తానని ప్రజలకు ఊరించారని, ఓట్లు దండుకున్న తర్వాత ఆ పథకాలు అమలు చేయడం సాధ్యం కావడం లేదని చేతులెత్తేశారని, ఇటీవల కడపలో జరిగిన మహానాడులో ఆయన తనయుడు లోకేష్ ఆరు శాసనాలు చేశాడన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేని చంద్రబాబు, తన కుమారుడితో శాసనాలు చేయించడంలో అర్థం ఏమిటో ఈ పాటికి ప్రజలు అర్థం చేసుకున్నారని, కూటమిలో ఉన్న డీసీఎం పవన్ కల్యాణ్‌కే అర్థం కావడం లేదన్నారు. ఏదో ఒక విధంగా బాబు తన తనయుడిని గద్దెనెక్కించి రాష్ట్రాన్ని మరింతగా భ్రష్టు పట్టించేందుకు సన్నాహాలు చేస్తున్నాడన్నారు. సూపర్ సిక్స్‌తో పాటు 143 హామీలతో ప్రజలకు నమ్మించి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం ఒక్క హామీని నెరవేర్చకుండా ప్రజలకు వెన్నుపోటు పొడించిందని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఈ రోజు వెన్నుపోటు దినం జరుపుకోవడం గొప్పపరిణామమని పేర్కొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ కాలంలో ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు పరిచిన పథకాలు, ఇతర పథకాలతో పాటు దాదాపు 170 పథకాలను ప్రవేశపెట్టి అమలు పరిచారని గుర్తు చేశారు. చంద్రబాబుకు గద్దెదిగే కాలం వచ్చిందని, అయినా మోసం,


తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి, పక్కన వైఎస్సార్ సీపీ నాయకులు

దగా చేయడమే పనిగా పెట్టుకున్నారని, రాష్ట్రంలో ఒక్క పథకం కూడా అమలు చేయకుండా జగనన్న ఆధ్వర్యంలో ఇచ్చిన పథకాల డబ్బు దాదాపు రూ 2.75 లక్షల కోట్లు, డీబీటీ, నాన్ డీబీటీ కింద సంవత్సరానికి రూ.60 వేల కోట్ల డబ్బులు ఇప్పుడు ఏమయ్యాయని, అవి ఎవరి జేబులోకి వెళ్లాయని ప్రశ్నించారు. ఈ డబ్బంత బాబుగారి బినామీ గ్యాంగ్‌కు చేరిందని ఆరోపించారు. ఈ రోజు రాష్ట్రంలో ఉన్న పరిస్థితిని పరిశీలిస్తే వ్యవసాయ రంగం క్రాప్ హాలిడే ప్రకటించిందని, మిర్చి రైతులు దగా చేయబడ్డారని, రూ.24 వేల నుంచి రూ.8 వేలకు పడిపోయిందన్నారు. పత్తిని సగానికి కొనే దిక్కులేదని, పొగాకుకు ధర లేక ఆ బేళ్లను రైతులు ఇళ్లల్లో పెట్టుకున్నారని, రాష్ట్రంలో ఉన్న హార్టీకల్చర్‌ను రోడ్డున పడేశారని విమర్శించారు. రాష్ట్ర ఖజానాను దోచుకుంటూ, రైతు పండించిన పంటను దగాకోరుల చేతుల్లో పెట్టారని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వంలో దగా చేయబడుతుంది ఒక్క రైతే కాదని, ఉద్యోగులు, వ్యాపారవేత్తలు, మహిళలు, కూలీలు ఉన్నారని, ఈ విధంగా వారందరినీ వెన్నుపోటు పొడించి పాలనను కొనసాగిస్తున్నారని ఎమ్మెల్యే తాటిపర్తి విమర్శించారు. తొలుత ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి వైఎస్సార్ విగ్రహానికి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు.


యర్రగొండపాలెం నిరసనకు హాజరైన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు

వెన్నుపోటు దినానికి కదం తొక్కిన కార్యకర్తలు

యర్రగొండపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు వెన్నుపోటు దినం కార్యక్రమానికి బుధవారం ప్రజాప్రతినిధులు, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున కదం తొక్కారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మండల పార్టీ అధ్యక్షుడు ఏకుల మునలారెడ్డి ఏర్పాటు చేసిన ర్యాలీలో నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి ప్రజలు పాల్గొని ప్రభుత్వంపై ఉన్న తమ వ్యతిరేకతపై గళం విప్పారు. ముఖ్యంగా నల్లమల అడవిలో ఉన్న పాలుట్ల గూడెం నుంచి గిరిజనులు పాల్గొని అందరినీ ఆశ్చర్య పరిచారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్దకు చేరుకున్న వారందరూ పోలీసులు అడ్డు చెప్తున్నప్పటికీ బ్యానర్లు, పార్టీ జెండాలు, ప్ల కార్డులు పట్టుకొని దిక్కులు పిక్కటిల్లేలా నినాదాలు చేసుకుంటూ వైఎస్సార్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. అక్కడ ఆయనకు పూలమాలవేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలపై మండిపడ్డారు. అనంతరం మండల రెవెన్యూ కార్యాలయం వద్దకు చేరుకొని తహసీల్దార్ మంజునాథరెడ్డికి వినతిపత్రం అందచేశారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చిన టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలు మర్చిపోయిందని, ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్నా ఎన్నికల్లో ఆర్భాటంగా ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలతో పాటు 143 వాగ్దానాల్లో ఏ


వెన్నుపోటు నిరసనకు కదిలిన పాలుట్ల గిరిజనులు

ఒక్కటీ అమలు చేయలేదు. ఈ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు వెన్నుపోటు పొడించిది. టీడీపీ కూటమి ప్రభుత్వం తీరుతో రాష్ట్రంలో అన్ని రంగాలు నిర్వీర్యమయ్యాయి. పిల్లలు, విద్యార్థులు, నిరుద్యోగులు, మహిళలు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్కూళ్లు, వైద్యశాలలు నాశనం అయ్యాయి. విద్యుత్ బిల్లులు ఏకంగా రూ.15 వేల కోట్లు ప్రజలపై అదనపు భారం పడింది. ఏ ఒక్క పథకం అమలు చేయకపోయినా ఏడాది కాలంలో రూ.1.50 లక్షల కోట్లు అప్పు చేశారు. రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తుండటంతో రాష్ట్రంలో శాంతి, భద్రతలు పూర్తిగా క్షీణించాయి. మహిళలకు, బాలికలకు, దళితులకు రక్షణ కరువైందని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజలు సుభిక్షంగా ఉండాలన్న ఆంక్షతో కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకే ఈ వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని చేపట్టినట్లు అందులో పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఉడుముల శ్రీనివాసరెడ్డి, ముస్లిం మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్ అబ్దుల్ మజీద్, జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు దొందేటి నాగేశ్వరరావు, కార్యదర్శులు కె.ఓబులరెడ్డి, ఎస్.ప్రసాద్, అంగిరేకుల ఆదినారాయణ, డి.వెంకటేశ్వర్లు, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు గంట వెంకట రమణారెడ్డి, పి.కృష్ణారెడ్డి, ఎస్.పోలిరెడ్డి, ఎంపీపీలు గుమ్మా పద్మజ ఎల్లేష్ యాదవ్, ఆళ్ల సుబ్బమ్మ ఆంజనేయరెడ్డి, జెడ్పీటీసీ యేర్వ చలమారెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఎం.ఆదిశేషు, ఆదిత్య విద్యా సంస్థల అధినేత సూరె రమేష్, ఆర్యవైశ్య సంఘ మండల అధ్యక్షుడు పబ్బిశెట్టి శ్రీనివాసులు, వివిధ విభాగాల నాయకులు సయ్యద్ జబీవుల్లా, దొగిపర్తి సతీష్ కుమార్, కందూరి కాశీనాథ్, గుండారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఎం.సత్యంరెడ్డి, డి.రసూల్, షేక్.బుజ్జి, జానకి రఘు పాల్గొన్నారు.

తాళ్లూరు: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నియోజకవర్గ కేంద్రం దర్శిలో వెన్నుపోటు దినం కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు.

వెన్నుపోటు దినానికి భారీగా తరలిన కార్యకర్తలు

దొనకొండ: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు మండల కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, బూచేపల్లి అభిమానులు సుమారు 200 మంది వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి బుధవారం దర్శికి బయల్దేరి వెళ్లారు. దర్శి వెళ్లిన వారిలో వైఎస్సార్ సీపీ జిల్లా యూత్ విభాగం అధ్యక్షుడు గొంగటి శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా యాక్టివ్ సెక్రటరీ బత్తుల వెంకట సుబ్బయ్య యాదవ్, నియోజకవర్గ బూత్ కమిటీ కన్వీనర్ కాలూరి రమణయ్య, వల్లభ రామారావు, బాపనపల్లి శ్రీను, కన్నెధార వెంకట సుబ్బయ్య, ఐలూరి శ్రీనివాస రెడ్డి, పత్తికొండ వెంకట సుబ్బయ్య, వడ్లమూడి బుజ్జి, గొంగటి పోలిరెడ్డి, గొంగటి పెద్దిరెడ్డి, పులిమి శివ, కె.ప్రసాద్, ఎగ్గోని కృష్ణారెడ్డి, వల్లభనేని వీరాచారి, కసిబిసి నాగరాజు, తాల్లూరి నగేష్, కంది ఆంజనేయులు పాల్గొన్నారు.

పార్టీ నాయకుడిని పరామర్శించిన బూచేపల్లి


కృష్ణారెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి

దర్శి (కురిచేడు): ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి విశ్రాంతి తీసుకుంటున్న పార్టీ నాయకుడు బండి కృష్ణారెడ్డిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. ఆయన ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట మండల పార్టీ కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, మున్సిపల్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమ్మిత అంజిరెడ్డి, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

రాజీయే రాజమార్గం

- నేడు జాతీయ లోక్ అదాలత్

పుల్లలచెరువు: న్యాయ స్థానాల్లో రాజీకి అవకాశం కలిగిన కేసులను ఇరువర్గాల మధ్య పరిష్కరించేందుకు గురువారం మార్కాపురం కోర్టు ప్రాంగణంలో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమానికి పోలీసులు, న్యాయవాదుల తోడ్పాటుతో విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. లోక్ అదాలత్ పరిధిలోకి వచ్చే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ సంపత్‌కుమార్ కోరారు. ఆయన బుధవారం మాట్లాడుతూ పరిష్కారానికి అవకాశం ఉన్న కాంపౌండబుల్ కేసులు అంటే కొట్లాటలు, జూదం, రోడ్డు ప్రమాదంలో స్వల్పగాయాలు, ర్యాష్ డ్రైవింగ్, జగడాలు, భార్యాభర్తల తగవులు, బహిరంగ ప్రదేశంలో మద్యపానం, భూవివాదాలు, సివిల్ వివాదాలు, కార్మిక, పారిశ్రామిక వివాదాలు, న్యూసెన్స్ కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు ఉంటాయని ఆయన వివరించారు.

డబ్బు, సమయం ఆదా

కోర్టులో ఉన్న కాంపౌండబుల్ కేసులను సులువుగా పరిష్కరించుకునేందుకు ఆదాలత్ ఎంతో ఉపయోగపడుతుందని, తద్వారా కక్షిదారులకు సమయంతో పాటు సొమ్ము ఆదా అవుతుందని ఎస్సై వివరించారు. కక్షలు విడనాడి సామరస్య ధోరణి అవలంబిస్తే కేసుల నుంచి విముక్తి లభించి ఉపశమనం కలుగుతుందన్నారు. సంబంధిత వర్గాలు ఆదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పుల్లలచెరువు స్టేషన్ పరిధిలో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చర్యలు చేపడుతున్నామని వివరించారు. ఇందులో రాజీకి అనువైన కేసులను విచారణ చేసి ఇరువర్గాలకు సమాచారం ఇస్తున్నామని, కేసుల భారాన్ని తగ్గించేందుకు ఉభయ వర్గాల మధ్య రాజీ కుదిర్చేందుకు నచ్చజెబుతున్నామని ఆయన వివరించారు. ఆయా కేసుల్లో ఉన్న కక్షిదారులు చర్చించుకుని వీటి నుంచి బయటపడేందుకు సానుకూల దృక్పథంతో వ్యవహరించాలన్నారు. సంబంధిత క్రిమినల్ కేసులతో పాటు సివిల్ కేసులను సైతం పరిష్కరించుకునేందుకు ముందుకు రావాలని ఆయన కోరారు.

ఉత్సాహంగా వేసవి తరగతులు

పెద్దారవీడు: గ్రంథాలయంలో చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ తరగతులు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిబిరంలో భాగంగా గ్రంథపాలకుడు ఏర్వ వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నీతి కథలు చెప్పించడం, పుస్తకం పఠనం చేయించడం, చెస్, క్యారమ్స్ తదితర ఆటల పోటీలు బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నీతి కథలు చదివితే వ్యక్తిత్వ వికాసం, నైతిక విలువలు అలవర్చుకోవచ్చన్నారు. భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకునేందుకు పుస్తక పఠనం ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. గురువారం వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తారని తెలిపారు.

రైతులతో శాస్త్రవేత్తల ముఖాముఖి

తాళ్లూరు: మండలంలోని లక్కవరంలో మండల వ్యవసాయాధికారి బి.ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో బుధవారం వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయంలో లాభాలు పెంచే విధంగా శాస్త్రవేత్తలు రైతులతో ముఖాముఖిగా చర్చించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ రైతులు సాంకేతికతను ఉపయోగించుకొని నికర ఆదాయం పొందాలన్నారు. నూనె గింజల ఉత్పత్తి సాధించడమే ప్రధాన లక్ష్యమని, జిల్లాలో ప్రస్తుతం 1.46 వేల కోట్ల విలువైన నువ్వులను దిగుమతి చేసుకుంటున్నామని చెప్పారు. నువ్వుల పంటతో కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. ఖరీఫ్ పంటలకు ముందస్తు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలిపారు. భారతీయ నూనె గింజల పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.రామారావు, కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ టి.వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రకృతి సాగు ఇన్‌చార్జి నరసింహ పాల్గొన్నారు.

చలో విజయవాడను విజయవంతం చేయాలి

ముండ్లమూరు (కురిచేడు): ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఉద్యోగుల సంఘ సంయుక్త కార్యదర్శి డి.వెంకట్రావు కోరారు. మారెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఉద్యోగులు విజయవాడలో జరిగే కార్యక్రమం విజయవంతం చేయాలని కోరుతూ వాల్‌పోస్టర్‌ను ఆయన బుధవారం ఆవిష్కరించారు. ఉద్యోగులకు పెండింగ్ బకాయిలపై విజయవాడ సమావేశంలో చర్చిస్తారని తెలిపారు. ఏపీ ఉద్యోగుల సంఘ ఉపాధ్యక్షుడు కె.ఆనందబాబు, కాంట్రాక్టు ఉద్యోగులు, రెగ్యులర్ ఉద్యోగులు పాల్గొన్నారు.